క్లుప్తంగా

కాళికాంబదేవికి ప్రత్యేక పూజలు



నంద్యాల(వ్యవసాయం): గాంధీ చౌక్‌లో వెలసిన శ్రీకాళికాంబ చంద్రశేఖరస్వామి దేవస్థానంలో శుక్రవారం సందర్భంగా కాళికాంబదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు ఉదయం సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి ఒడి బియ్యం కార్యక్రమం, పుష్పాభిషేకం చేపట్టి మహామంగళ హారతులు ఇచ్చిన అనంతరం రాహుకాల పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ మూర్తిని విశేషంగా అలంకరించిన పల్లకీలో ఆశీనులు గావించి ఆలయ ప్రాకారంలో ప్రదక్షిణలు చేయించారు. చివరగా నవవిధ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కాళీమాత సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

విత్తన దుకాణాల తనిఖీ



శిరివెళ్లలో దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏడీఏ

శిరివెళ్ల: మండలంలో శుక్రవారం విత్తన దుకాణాలను నంద్యాల జీవ నియంత్రణ ప్రయోగశాల ఏడీఏ సుధాకర్ తనిఖీ చేశారు. శిరివెళ్లలోని జువారి ఫర్మ్ హబ్ లిమిటెడ్, యర్రగుంట్లలోని యాసిన్ సీడ్స్ దుకాణాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. స్టాక్ రిజిష్టర్లు, ఇన్వాయస్‌లు, బిల్లులను సరి చూశారు. నకిలీ విత్తనాలు అమ్మరాదని, రైతులకు తప్పని సరిగా బిల్లులు వెంటనే ఇవ్వాలని ఆదేశించారు. ఆళ్లగడ్డ ఏడీఏ రామ్మోహన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వీఆర్‌ఏ మృతి

నంద్యాల(అర్బన్): మండలంలోని భీమవరం గ్రామానికి చెందిన వీఆర్‌ఏ హుసేన్ ఖాన్ శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. రెవెన్యూ సహాయకుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణ, కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ రాజు, వీఆర్వో రాజేశ్వరి ఆయన మృతదేహాన్ని సందర్శించి సంతాపం తెలిపారు. అనంతరం మృతుడు హుసేన్ ఖాన్ అంత్యక్రియలకు ప్రభుత్వం అందించిన రూ.25 వేలు, మండల వీఆర్‌ఏల సంఘం తరపున రూ.5 వేలు మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు.

బైకును ఢీకొన్న ఆటో

- తల్లీ, కుమారుడికి గాయాలు



గాయపడిన ఫాతిమాబీ

మహానంది: బండి ఆత్మకూరు- సంతజూటూరు గ్రామాల మధ్య వంతెన సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లీ, కుమారుడికి గాయాలైన ఘటన బండిఆత్మకూరు మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. నంద్యాల మండలం కొత్తపల్లె గ్రామానికి చెందిన షేక్ ముత్తు, కుటుంబ సభ్యులు బైక్ మీద వస్తుండగా ఎదురుగా వెళ్తున్న ఆటో ఢీకొనడంతో షేక్ ఫాతిమాబీ, కుమారుడు ఖలీల్ గాయపడ్డారు. అదే సమయంలో సంతజూటూరు గ్రామానికి విధులకు వెళుతున్న వీఆర్వో సుంకన్న స్పందించి 108 వాహనానికి సమాచారం అందించారు. అనంతరం వారిని చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పాలిటెక్నిక్‌తో ఉపాధి మెరుగు



ఉద్యోగ నియామక పత్రాలతో డిప్లొమా విద్యార్థులు

శ్రీశైలంప్రాజెక్ట్: పాలిటెక్నిక్ విద్యతో ఉద్యోగ,ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని శ్రీశైలం ప్రభుత్వం మోడల్ రెసిడెన్సియల్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డి.రంగయ్య అన్నారు. శుక్రవారం కళాశాల ప్రాంగణంలో వివిధ సంస్థలలో క్యాంపస్ సెలెక్షన్‌లో ఉద్యోగ అవకాశాలు పొందిన సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులను ప్రిన్సిపాల్ రంగయ్య, నియామకాల అధికారి డాక్టర్.కె.లక్ష్మీపతి అభినందించారు. రిటైర్డ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మద్దిలేటి పాల్గొన్నారు.

తూము ఏర్పాటుచేసి సాగునీరివ్వాలి

జూపాడుబంగ్లా: కేసీ కాల్వ 98 లాకిన్స్‌లా వద్ద ప్రత్యేక తూము ఏర్పాటుచేసి తాటిపాడు, 80 బన్నూరు గ్రామాలకు సాగునీరందించాలని సీపీఐ నాయకుడు రమేష్‌బాబు డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ 98 తూము తర్వాత కేసీ కాల్వ కింద తాటిపాడు, 80 బన్నూరు గ్రామాల రైతులకు సంబంధించి 700 ఎకరాల సాగుభూమి ఉందన్నారు. ఈ పొలానికి సాగునీరు అందక రైతులు ఏటా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. జిల్లా మేజర్ ఇరిగేషన్ అధికారులు, కేసీ కాల్వ అధికారులు రైతుల సమస్యలను దృష్టిలో పెట్టుకొని ప్రత్యేక తూమును ఏర్పాటుచేసి సాగునీరు అందించాలని కోరారు. లేకపోతే రైతులను పోగుచేసి ఆందోళనలు చేపడతామని స్పష్టం చేశారు. రైతులు నరసింహ, తిరుమలయ్యగౌడు, మహేష్, వెంకటేశ్వర్లు, రాముడు తదితరులు పాల్గొన్నారు.



హరినగరం సమీప పొలాల్లో ట్రాక్టర్‌తో సేద్యం చేస్తున్న దృశ్యం,



ముకుందాపురం వద్ద మొక్కజొన్న నాటుతున్న కూలీలు,



చిత్రేనిపల్లె వద్ద ఏపుగా పెరుగుతున్న జీలుగ

జోరుగా ముందస్తు సాగు

- ఇప్పటికే కురిసిన వర్షాలకు పదునెక్కిన పొలాలు
- ముందస్తు పంటల సాగుకు సిద్ధమవుతున్న రైతన్నలు
- పలుచోట్ల మినుము, మిర్చి, మొక్కజొన్న సాగు
- అన్నదాతల్లో రెట్టించిన ఆశలు



నర్సాపురం వద్ద సాగు చేసిన మొక్కజొన్న



ఆలమూరు వద్ద మిర్చి నారు నాటుతున్న కూలీలు

రుద్రవరం: గతేడాది వరుణుడు ముఖం చాటేసినా.. ఈ ఏడాది ముందుగానే నేలలు పదునెక్కేలా కురిశాడు. దీంతో ముందస్తు ఖరీఫ్ సాగుపై అన్నదాతల్లో ఆశలు మొదలయ్యాయి. ఇప్పటికే ఎండకారు సేద్యం చేసి పొలాలను సిద్ధం చేసుకోగా.. వారి ఆశలకు తగ్గట్టుగానే మూడు విడతలుగా వర్షం కురిసింది.అంతే ఉత్సాహంగా పొలాల బాట పట్టారు. ట్రాక్టర్లతో సేద్యాలు చేయించి గత పంట తాలూకు అవశేషాలను తొలగించడం, ఎరువులు తోలించి చల్లించడం వంటి పనులన్నీ పూర్తి చేసి పంటల సాగుకు సిద్ధమవుతున్నారు. మండల కేంద్రమైన రుద్రవరంతో పాటు రెడ్డిపల్లె, ఆర్.నాగులవరం, నరసాపురం, హరినగరం, ముకుందాపురం,చిత్రేనిపల్లె,ఆలమూరు తదితర గ్రామాల రైతులు ఒకడుగు ముందుకేసి కురిసిన వర్షాలకు పొలాల్లో సేద్యపు పనులన్నీ పూర్తి చేసి బోరు మోటార్ల నీటితో ఇప్పటికే మొక్కజొన్న, మిర్చి, మినుము వంటి పంటలు సాగు చేశారు. ప్రస్తుతం అవి మొలక దశ దాటి పచ్చగా కళకళలాడుతున్నాయి. గతేడాదిలాగే మంచి లాభాలు గడించాలనే ఆశలతో రైతులు ముందస్తుగా విస్తారంగా పంటలు సాగు చేస్తున్నారు. మరో వైపు వరి సాగు చేసేందుకు ఇప్పటికే పొలాల్లో జీలుగ విత్తనాలు చల్లగా మొక్కలు ఏపుగా పెరుగుతున్నాయి. మరో వైపు కొందరు మోటార్ల కింద నారుమడులు సిద్ధం చేస్తున్నారు.



రుద్రవరం సమీపంలో సాగైన మినుము

10,311 పాఠ్య పుస్తకాలు మంజూరు

ఉయ్యాలవాడ : మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి రెండవ విడత 10,311 పాఠ్య పుస్తకాలు మంజూరయ్యాయని ఎంఈఓ వీరప్రతాప్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మొదటి విడతగా 1,2 తరగతులకు పూర్తి స్థాయిలో, 6వ తరగతి తెలుగు, గణితం పాఠ్య పుస్తకాలతో కలిపి 2,088 స్టాక్ పాయింట్‌కు చేరాయన్నారు. ప్రస్తుతం 8,9,10 తరగతులకు అన్ని రకాల పాఠ్య పుస్తకాలు మండల స్టాక్ పాయింట్‌కు చేరాయని చెప్పారు. మండలానికి మొత్తం 22వేల పాఠ్య పుస్తకాలు అవసరం కాగా మరో విడత పాఠ్య పుస్తకాలు రావలసి ఉందన్నారు. జూన్ 12వ తేదీన పాఠశాలలు పునః ప్రారంభం అయ్యే నాటికి విద్యా కానుక, బూట్లు, సాక్స్‌లు, బెల్ట్, బ్యాగులు ఆయా పాఠశాలల విద్యార్థులకు పంపిణీ చేయనున్నట్లు ఎంఈఓ స్పష్టం చేశారు. సీఆర్పీలు సిద్దమ్మ, లక్ష్మీదేవి, లక్ష్మిరెడ్డి ఉన్నారు.



ఉయ్యాలవాడ మోడల్‌స్కూల్‌లో పాఠ్య పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈఓ

కౌంటింగ్ కేంద్రాల వద్దకు వెళ్లొద్దు



చాగలమర్రి పోలీసు స్టేషన్ వద్ద మాట్లాడుతున్న డీఎస్పీ షర్ఫుద్దీన్

చాగలమర్రి: ఈ నెల 4వ తేదీన ఎన్నికల ఫలితాలు వెలవడనున్నాయని, ఆళ్లగడ్డ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు నంద్యాలలో ఉంటుందని, ఓట్ల లెక్కింపు కేంద్రానికి పోటీలో ఉన్న అభ్యర్థులు, ఏజెంట్లు మాత్రమే వెళ్లాలని, మిగిలిన వారు వెళ్లరాదని ఆళ్లగడ్డ డీఎస్పీ షర్ఫుద్దీన్ తెలిపారు. శుక్రవారం బీఎస్ఎఫ్ బలగాలతో మండల కేంద్రంలో కవాతు నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆళ్లగడ్డ, శిరివెళ్ల వద్ద పోలీసు చెక్ పోస్టులు ఏర్పాటు చేసి కౌంటింగ్ పాసులను తనిఖీ చేసి పంపుతామన్నారు. ఓట్ల లెక్కింపు ప్రశాంత వాతవరణంలో నిర్వహించటానికి ప్రజలందరూ సహకరించాలని కోరారు. గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగేలా కాకుండా ప్రశాంతంగా ఉండాలని చెప్పారు. ఆళ్లగడ్డ రూరల్ సీఐ హనుమంతనాయక్, శిరివెళ్ల సీఐ చంద్రబాబు, ఎస్‌ఐలు రమణయ్య, రామాంజనేయులు రెడ్డి, నరసింహులు పాల్గొన్నారు.

‘మధ్యాహ్నం’ రుచికరంగా వండాలి



వంట పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తున్న దృశ్యం

గోస్పాడు: ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని నిర్వాహకులు రుచికరంగా తయారు చేయాలని ఎంఈఓలు అబ్దుల్ కరీం, సురేంద్రనాథ్ తెలిపారు. సరైన పౌష్టికాహారం వల్ల కలిగే ప్రయోజనాలపై వైద్యాధికారి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శుక్రవారం వంటల తయారీపై ఒకరోజు శిక్షణ సమావేశాన్ని స్థానిక మోడల్ స్కూల్‌లో నిర్వహించారు. అలాగే వంట చేసే సమయంలో అగ్ని ప్రమాదాలు, నివారణపై ఫైర్ సిబ్బందితో అవగాహన కల్పించారు. అనంతరం వంట నిర్వాహకులకు వంటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ ఖాజాహుసేన్, ఫైర్ సిబ్బంది శివకుమార్, హుసేన్ బాషా, సీఆర్పీలు వెంకటేశ్వర్లు, రాముడు పాల్గొన్నారు.

సీమ హక్కుల అమలులో నిర్లక్ష్యం



మాట్లాడుతున్న బొజ్జ దశరథరామిరెడ్డి

నంద్యాల(సెంట్రల్): రాష్ట్ర విభజన జరిగి పదేళ్లయినా రాయలసీమ హక్కుల అమలుపై నిర్లక్ష్యం కొనసాగుతోందని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జ దశరథరామిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక సమితి కార్యాలయంలో రాయలసీమ అభివృద్ధికి చేపట్టాల్సిన అంశాలపై ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీమ ప్రాజెక్టుల నిర్వహణకు సరిగా నిధులు కేటాయించకపోవడంతో నికరజలాలపై నిర్మించిన అన్ని ప్రాజెక్టులు శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. సిద్ధేశ్వరం అలుగు ప్రజా శంకుస్థాపన 8వ వార్షికోత్సవాన్ని ఈనెల 10వ తేదీన సంగమేశ్వర వద్ద నిర్వహించాలని, అలాగే హైకోర్టు, సీడ్ హబ్, హార్టికల్చర్ హబ్, రాష్ట్రస్థాయి కార్యాలయాలు, కార్పొరేషన్ల ఏర్పాటుపై నివేదికను నూతన ప్రభుత్వానికి అందించాలని తీర్మానించారు. సమావేశంలో రాయలసీమ విద్యావంతుల వేదిక పాణి, ఏపీ టీచర్స్ ఫెడరేషన్ అధ్యక్షులు ఏసేపు, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ వేదిక కన్వీనర్ రామకష్టారెడ్డి, జేవీవీ నుంచి శేషాద్రి రెడ్డి, రైతు కూలీ సంఘం కన్వీనర్ సుంకన్న, రాయలసీమ సాగునీటి సాధన సమితి ఉపాధ్యక్షులు వాడాల చంద్రశేఖర్ రెడ్డి, రంగారెడ్డి, ఆదినారాయణ రెడ్డి పాల్గొన్నారు.

అలరించిన ఖవ్వాలి

చాగలమర్రి: స్థానిక పెద్దమకానం వీధిలో వెలసిన శ్రీదస్తగిరి స్వామి, శ్రీబందేషావలి స్వామి, శ్రీ షాబుషా వలి స్వాముల వారి ఉరుసు సందర్భంగా కర్ణాటక రాష్ట్రానికి చెందిన మైసూర్, బెంగళూరుకు చెందిన విద్వాంసులు తౌసిక్ ఖాద్రి, అర్షియానాజ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఖవ్వాలి అలరించింది . అలాగే దాతల సహకారంతో అన్నదానం ఏర్పాటు చేశారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. ఖవ్వాలి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కమలాపురం దర్గా-ఏ-గఫ్ఫారియా ఖలీఫా మౌలానా ఫైజుల్ ఖాదర్ షా ఖాద్రీ స్వామి హాజరయ్యారు. మూడు రోజుల పాటు జరిగిన ఉత్సవాల సందర్భంగా గ్రామంలో వివిధ రకాల దుకాణాలు వెలిశాయి.

నేడు హనుమజ్జయంతి వేడుకలు

నంద్యాల (వ్యవసాయం): పట్టణంలోని పలు దేవాలయాల్లో వెలసిన ఆంజనేయస్వామికి శనివారం హనుమజ్జయంతి వేడుకలు నిర్వహించడానికి భక్తులు ఏర్పాట్లు చేస్తున్నారు. బయటి పేట ఆంజనేయస్వామి దేవస్థానంలో ఈఓ ఆంజనేయ శర్మ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఉదయాన్నే స్వామివారికి అభిషేకాలు, సింధూర పూజ, తమల పాకులతో అర్చన, అలంకారం, వడమాల అనంతరం సామూహిక కుంకుమార్చనలు, సాయంత్రం గ్రామోత్సవం ఉంటుందని చెప్పారు. కాళికాంబ చంద్రశేఖర స్వామి ఆలయంలో అభయాంజనేయ స్వామికి, టెక్కె నాగులకట్టలో వెలసిన ఆంజనేయస్వామికి 1,116 అరటిపండ్లతో అర్చన, గోపాల్ నగర్‌లో వెలసిన ఆంజనేయ స్వామికి, సంజీవనగర్ రామాలయంలో అభయాంజనేయ స్వామికి పంచామృతాభిషేకాలు చేపడతామని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

దుర్గమ్మ గుడిలో చోరీ

మహానంది : అబ్బీపురం గ్రామంలోని దుర్గమ్మ గుడిలో చోరీ జరిగినట్లు ఆలయ అర్చకులు తెలిపారు. గురువారం రాత్రి జరిగిన సంఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చిందన్నారు. సుమారు 20 కిలోలతో తయారు చేసిన మూడు కంచు కట్టలను గుర్తు తెలియని దుండగులు అపహరించుకెళ్లారని చెప్పారు. దీంతో పాటు హుండీలోని కొంత నగదును ఎత్తుకెళ్లారన్నారు. దుండగులు బయట పడకుండా తప్పించుకునేందుకు సీసీ కెమెరాల వైర్‌ను కట్ చేయడం విశేషం.

సేవలతోనే పేరు ప్రతిష్టలు

మహానంది : ప్రజలకు చేసిన సేవలే ఉద్యోగులకు పేరు ప్రతిష్టలు తెచ్చిపెడతాయని తిమ్మాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ భగవాన్ దాస్ అన్నారు. పీహెచ్‌సీలో పీహెచ్‌ఎన్ పుష్పలీల పదవీ విరమణ సందర్భంగా శుక్రవారం ఆమెను సన్మానించారు. ఆరోగ్య సిబ్బంది ఆమె సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్ నటరాజు, ఎంపీహెచ్ఈఓ హుసేన్ రెడ్డి, విజయ్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న దృశ్యం

ఇలాగా తొలగించేది?

నంద్యాల(సిటీ): వేసవిలో ఎండ తీవ్రత దృష్ట్యా ప్రయాణికులు, ప్రజల సంక్షేమం కోసం మున్సిపల్ అధికారులు చలువ పందిళ్లు వేశారు. మే నెల ముగియడంతో వాటి తొలగింపు పనులు చేపట్టారు. అయితే పందిళ్ల ఏర్పాటు కోసం రోడ్లపై గుంతలు వేసి కర్రలు పాతారు. తొలగింపులో భాగంగా కర్రలను పూర్తిగా తొలగించకుండా రోడ్డుపై భాగంలో కొంత వరకు వదిలేసి కోసేశారు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కొందరు ద్విచక్రవాహనదారులు వాటిని తట్టుకొని కిందపడ్డారు కూడా. ఇలాగేనే తొలగించేదని కొందరు వాహనదారులు, బాటసారులు ప్రశ్నిస్తున్నారు. మున్సిపల్ అధికారులు గమనించి ప్రమాదాలు చోటుచేసుకోకముందే వాటిని పూర్తిస్థాయిలో తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.





శ్రీనివాస సెంటర్‌లో చలువపందిళ్ల కోసం వేసిన కర్రలను పూర్తిస్థాయిలో తొలగించని దృశ్యం

గుంతలను పూడ్చండి

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని సంజీవనగర్ గేట్ టర్నింగ్‌లో డ్రైనేజీ గుంత ప్రమాదకరంగా మారిందని, వెంటనే పూడ్చివేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి బాబాఫకృద్దీన్, సోమన్న శుక్రవారం డిమాండ్ చేశారు. పట్టణంలో నెలకొన్న సమస్యలను మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలని కోరారు. సంజీవ నగర్ గేట్ నుంచి శ్రీనివాస సెంటర్‌కు వెళ్లే రహదారి మూసుకుపోయిందన్నారు. షాపుల యజమానులు ఫుట్‌పాత్‌ను ఆక్రమించుకోవడం, ఆటోలు రహదారికి అడ్డంగా నిలుపుతుండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. పట్టణంలో పలుచోట్ల రోడ్లపై గుంతలు ప్రమాదకరంగా ఉన్నాయని వెంటనే పూడ్చాలన్నారు.

నలుగురిపై చీటింగ్ కేసు

శిరివెళ్ల: భూమి డబుల్ రిజిష్టర్‌పై నలుగురిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సురేష్ శుక్రవారం తెలిపారు. వివరాలు.. గుండంపాడు- మహదేవపురం రెవెన్యూ పరిధిలోని 205 సర్వే నంబర్‌కు చెందిన 1.04 ఎకరాలను గుండంపాడుకు చెందిన నుసిపుల్లారెడ్డి, నిడిగంటి శ్రీనివాసులుతో పాటు ఎస్.పుల్లారెడ్డి, గోవిందపల్లెకు చెందిన మహేశ్వరరెడ్డి స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో డబుల్ రిజిష్టర్ ప్రక్రియ చేపట్టినట్లు అధికారుల దృష్టికి రావడంతో విచారణ చేశారు. సబ్ రిజిస్ట్రార్ బాల సుబ్రహ్మణ్యం ఫిర్యాదుపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.



గోస్పాడులో నిర్మానుష్యంగా ఉన్న ప్రధాన రహదారి,



దొర్నిపాడులో మధ్యాహ్న సమయంలో...

పెరిగిన ఎండ

- పది రోజులుగా తగ్గిన వేసవి తీవ్రత
- రోహిణి ప్రభావంతో మూడు రోజుల నుంచి పెరిగిన ఉష్ణోగ్రతలు
- దొర్నిపాడు, గోస్పాడులో 42డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

గోస్పాడు: వేసవి తీవ్రత మళ్లీ పెరగడంతో ప్రజలు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. భానుడి ప్రతాపంతో ఉదయం 10 గంటలకే ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. వారం రోజుల క్రితం కురిసిన వర్షం కారణంగా కొంత వరకు ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టడంతో జనం ఊపిరి పీల్చుకున్నారు. ఏప్రిల్‌లో 45 నుంచి 47 డిగ్రీలకు ఉష్ణోగ్రత చేరింది. అయితే ఇటీవల కురిసిన వర్షాల అనంతరం కొంత చల్లబడింది. అయితే వాతావరణంలో మార్పులు చోటు చేసుకొని మూడు రోజులుగా ఉష్ణోగ్రతలు మళ్లీ పెరుగుతున్నాయి. 38, 40 నుంచి 43 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అలాగే రోహిణీ కార్తె కావడంతో మరికొన్ని రోజులు భానుడి ప్రభావం అధికంగా ఉండే అవకాశముంది. ప్రస్తుతం ఉదయం 10 గంటలకే ఎండ ముదురుతుండటంతో జనం బయటకు రావడం లేదు. అలాగే ఎండ వేడిమి, వడగాల్పులతో పాటు ఉక్కపోతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.

దొర్నిపాడు: రోహిణి ప్రభావంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. శుక్రవారం మండలంలో 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావడంతో భానుడి తాపానికి ప్రజలు బయటకు రాలేకపోతున్నారు. మూడు రోజులుగా ఎండ మండుతోంది. గత పదిరోజులుగా చల్లబడిన వాతావరణం మళ్లీ వేడెక్కడంతో జనం అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సాగుకు పొలాలను సిద్ధం చేయడంలో రైతులు, కూలీలు బిజీగా ఉన్నారు. ఎండ వేడిమి కారణంగా పనులకు వెళ్లడానికి జంకుతున్నారు.

పారితోషికం అందేదెన్నడు!

- పోలింగ్ ముగిసి మూడు వారాలు
- విధులు నిర్వర్తించిన సిబ్బందికి నేటికీ చెల్లించని వైనం
- ఓటింగ్ ఏర్పాట్లకు సొంతంగా ఖర్చు పెట్టిన చిరుద్యోగులు
- వారికీ అందని నిర్వహణ ఖర్చులు
- చిరుద్యోగులను నిలదీస్తున్న వ్యాపారులు
- ఓట్ల లెక్కింపు అనంతరం ఇస్తామని చెబుతున్న అధికారులు
- లెక్కింపు పూర్తయితే ఎవరిని అడగాలని ఆందోళన చెందుతున్న సిబ్బంది

ఆళ్లగడ్డ: సార్వత్రిక ఎన్నికల విధుల్లో పాల్గొన్న అధికారులు, సిబ్బందికి ఇవ్వాల్సిన పారితోషకంతో పాటు కొందరు దిగువ స్థాయి చిరుద్యోగులతో పెట్టించిన ఖర్చులు సైతం ఇవ్వాల్సిన సొమ్ములు ఇవ్వక పోవడంతో ఆ వర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. క్షేత్ర స్థాయిలో పనిచేయించుకున్న సిబ్బందికి ఇవ్వాల్సిన రెమ్యునరేషన్, పెట్టిన ఖర్చులు ఇవ్వాలని వారిని నియమించుకున్న అధికారులపై ఒత్తిడి చేస్తున్నారు. ఇచ్చే అరకొర మొత్తం ఎప్పుడు ఇస్తారో సరైన సమాధానం చెప్పకపోవడం ఏంటని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హోదా పరంగా ఉన్నతస్థాయిలో ఉన్నా.. చిన్న చిన్న ఉద్యోగులకు ఇవ్వాల్సిన దానిలో చేతివాటం ప్రదర్శించడం విమర్శలకు తావిస్తోంది.

రూ.52 కోట్ల బడ్జెట్ ఏమైంది?

ఎన్నికల ప్రక్రియ మొదలైనప్పటి నుంచి పోలింగ్ ప్రక్రియ పూర్తయ్యేవరకు అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు చేయడానికి, విధుల్లో పాల్గొన్న ఉద్యోగులకు పారితోషికంగా చెల్లించడానికి జిల్లాకు రూ.52 కోట్ల వరకు కేటాయించినట్లు సమాచారం. ఇందులో ముందస్తుగా ఒక్కో నియోజకవర్గానికి రూ.1.50 కోట్ల నుంచి రూ.2 కోట్ల వరకు ఎన్నికల నిర్వహణ సొమ్ము కేటాయించారు. అయితే పోలింగ్ ముగిసినా పారితోషికం అందని ఉద్యోగులు, వివిధ సేవలందించినా బిల్లులు అందని వారు.. నియోజకవర్గ కేంద్రాల్లో చెల్లింపు అధికారులుగా ఉన్న తహసీల్దార్లను నిలదీస్తున్నారు. వచ్చిన బడ్జెట్ అయిపోయిందని కొందరు, కౌంటింగ్ పనుల మీద బిజీగా ఉన్నాం, కౌంటింగ్ ప్రక్రియ పూర్తయిన తరువాత ఇస్తామని చెప్పి కొన్ని నియోజకవర్గాల అధికారులు తప్పించుకుంటున్నారు.

చేతి చమురు వదిలించుకున్న బీఎల్వోలు..

పోలింగ్ కేంద్రాల దగ్గర ఏర్పాట్లు చేసేందుకు కొన్ని చోట్ల బీఎల్వోలు ఒక్కొక్కరు రూ.10వేల నుంచి రూ.15 వేల వరకు వెచ్చించారు. వీరికి ఎన్నికల ముందు రోజు ఇచ్చింది కేవలం రూ.3 వేలు మాత్రమే. అయితే ఎన్నికల సంఘం రూ.8 వేలు నుంచి రూ.12 వేలు కేటాయించగా మిగిలిన మొత్తం ఏమైందనేది తెలియడం లేదు.

పాపం చిరుద్యోగులు..

ఎన్నికల సందర్భంగా నియోజకవర్గ ఎన్నికల కార్యాలయంలో విధులు నిర్వహించేందుకు తమ శాఖకు చెందిన చిరుద్యోగులను నియమించుకున్నారు. ఏ చిన్న వస్తువు అవసరమైనా వీరిని పురమాయించి తెప్పించుకున్నారు. అన్నిటికి ఒకేసారి కలిపి బిల్లులు ఇస్తామని చెప్పడంతో దుకాణాల్లో ఖాతాలు పెట్టి తీసుకొచ్చారు. అయితే ఇప్పుడు వాటి గురించి అడుగుతుంటే పట్టించుకునే వారు లేదని చిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులను నిలదీస్తే ఏం ఇబ్బందులు ఎదురవుతాయోనని ఓ వైపు.. అప్పు చెల్లించాలని వ్యాపారుల నుంచి పెడుతున్న ఒత్తిడి మరోవైపుతో చాలమంది దిగువ స్థాయి సిబ్బంది కార్యాలయం నుంచి బయటకు వెళ్లలేకపోతున్నారు.

పైసా చెల్లించలేదు..

సెక్టోరియల్ అధికారులు, వీవీటీ టీం, వీఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, ఎంసీసీ, పోస్టల్ బ్యాలెట్ అధికారులు, హోం ఓటింగ్ అధికారులు, ఈవీఎం డిస్ట్రిబ్యూషన్ అధికారులు, ఈవీఎంల రీకలెక్షన్ అధికారులు, ఈవీఎం ర్యాండమైజేషన్, పీఓ, ఏపీఓ, ఎన్నికల సిబ్బందికి ఇచ్చిన మాస్టర్ ట్రైనర్లు, నామినేషన్ సిబ్బంది, ఉప సంహరణ సిబ్బంది, నామినేషన్ పరిశీలన సిబ్బంది ఇలా వందలాది మంది ప్రభుత్వ, ప్రైవేటు వ్యక్తులను నియమించుకున్నారు. అయితే ఇప్పటి వరకు ఒక్క పైసా కూడా వీరికి చెల్లించకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఒక్కో నియోజకవర్గంలో పది మందికి పైగా సుమారు 2 నెలల నుంచి పనిచేసిన తాత్కలిక కంప్యూటర్ ఆపరేటర్లుకు పూర్తి స్థాయిలో చెల్లింపులు జరగలేదు. వీరికి ఒక్కొక్కరికి రూ.23 వేలు చెల్లించాల్సి ఉంది.

కౌంటింగ్ పూర్తయిన వెంటనే చెల్లిస్తాం

ఎన్నికల విధుల్లో పాల్గొన్న అధికారులకు ఎంత ఇవ్వాలన్నది జిల్లా అధికారులు నిర్ణయించక పోవడంతో పారితోషికం చెల్లింపు ఆలస్యమైంది. ఇంతలో ఓట్ల లెక్కింపు సమయం కూడా దగ్గర పడటంతో ఆ పనుల్లో తీరిక లేకుండా ఉన్నాం. 4వ తేదీ లెక్కింపు పూర్తయిన తరువాత పారితోషికం, ఖర్చు పెట్టిన వారందరికీ చెల్లిస్తాం. – నజీర్ అహమ్మద్, ఏఈఆర్వో, ఆళ్లగడ్డ

బ్యాంకు ఖాతాల్లో పింఛన్ సొమ్ము జమ

దొర్నిపాడు: మండలంలోని 9 సచివాలయాల పరిధిలోని 917 మందికి ఇంటివద్దనే పింఛన్లను పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ సుబ్బారెడ్డి శుక్రవారం తెలిపారు. బుర్రారెడ్డిపల్లె 133, చాకరాజువేముల 178, దొర్నిపాడు-1లో 92, దొర్నిపాడు-2లో 87, గుండుపాపల 98, కొండాపురం 114, క్రిష్టిపాడు 75, డబ్ల్యూ గోవిందిన్నె 83, డబ్ల్యూ కొత్తపల్లె 57 పింఛన్లను ఇంటివద్దనే ఇస్తారన్నారు. మొత్తం మండలంలో 3,678 పింఛన్లు ఉండగా వాటిలో 917 ఇళ్లవద్దకే వచ్చి ఇస్తారని మిగిలిన 2,761 మందికి వ్యక్తిగత బ్యాంకు ఖాతాలో జమ చేస్తారని చెప్పారు.